క్లుప్తంగా

ఉద్యోగ విధుల్లో బదిలీలు సహజం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

దుబ్బాకటౌన్: ఉద్యోగ విధుల్లో బదిలీలు సహజమని దౌల్తాబాద్ మండల విద్యాధికారి నర్సవ్వ అన్నారు. దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వారిని ఎంఈఓ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

నంగునూరులో..

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని నంగునూరు తహసీల్దార్ సరిత అన్నారు. కార్యాలయంలో పనిచేసిన అధికారులు శ్రీనివాస్ రెడ్డి, బాలరాజు, రాజబాబు, రాంప్రసాద్ బదిలీ అయ్యారు. గురువారం వారికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయాలన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేటకమాన్: ఆగస్టు 9వ తేదీన నిర్వహించనున్న హాలో మాదిగ.. చలో ఢిల్లీ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేటలోని అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం ఆవిష్కరించారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమ బడ్జెట్

రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా సంక్షేమ బడ్జెట్ అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మంత్రి భట్టివిక్రమార్క ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

అనాథలకు చేయూత

మిరుదొడ్డి(దుబ్బాక): తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలకు యువకులు చేయూతనందించారు. మండల పరిధిలోని చెప్యాలలో మర్రిపల్లి వెంకటేష్ గతంలో గుండె పోటుతో, ఇటీవల భార్య రేఖ విద్యుదాఘాతంలో మృతి చెందారు. తల్లిదండ్రుల మృతితో 18 సంవత్సరాలలోపు వయసు ఉన్న ఇద్దరు పిల్లలు శ్రద్ధ, ముఖేష్ అనాథలయ్యారు. దీంతో గ్రామ యువకులు విరాళాలుగా సేకరించిన రూ.37 వేలు వారికి అందజేశారు.

వినియోగించుకోండి

హుస్నాబాద్: ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) వి.రామారావు కోరారు. ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 19న రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక కౌంటర్లను హుస్నాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. స్వయంగా రాఖీ కట్టలేని ఆడపడుచులు ఆర్టీసీ కార్గో, పార్సిల్ సర్వీసుల ద్వారా అతి తక్కువ ధరల్లో రాఖీలను తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు పంపవచ్చన్నారు. త్వరలో కోహెడ, అక్కన్నపేట. చిగురుమామిడిలో ప్రత్యేక సేవలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సేల్స్ టీమ్ లీడర్ రాజు, సభ్యుడు సురేష్, ఆపరేషన్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రేవతి

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రావని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రేవతి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధి ఖాజీపూర్‌లో గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధ పడుతున్న వారి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో గ్రామాల్లో ప్రతీ శుక్ర, మంగళవారాల్లో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ శ్రీకళ, మండల పంచాయతీ ఆఫీసర్ జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల సందర్శన

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, గాగిల్లాపూర్, రేగులపల్లె గ్రామాల్లోని నర్సరీలను గురువారం జెడ్పీ సీఈఓ రమేశ్ సందర్శించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. త్వరగా మొక్కలను నాటించాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశించిన లక్ష్మాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ లక్ష్మప్ప ఉన్నారు.

గుంతలుపడి.. రాళ్లు తేలి..

అధ్వానంగా మారిన మట్టి రోడ్లు
- హడలిపోతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు
- బీటీ రోడ్లుగా మార్చాలని వినతి

కొన్ని గ్రామాల ప్రజలు మట్టి రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అవి గుంతలు పడి, రాళ్లు తేలి అధ్వానంగా ఉన్నా మరో మార్గం లేక వాటిపైనే ప్రయాణాలు చేస్తున్నారు. అత్యవసరంగా పనిపై వెళ్లేవారికి, అనారోగ్యానికి గురైన వారు మట్టి రోడ్లపై వెళ్లలేక ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. తమ గ్రామలకు బీటీ రోడ్లు వేయాలని కోరుతున్నారు.


గుంతలు పడిన ఎర్రగుంటపల్లి రోడ్డు

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ మండల కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరంలో ఎర్రగుంటపల్లి గ్రామం ఉంది. ఆ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు పడి, రాళ్లు తేలి అధ్వానంగా మారింది. ఈ ఊరికి వెళ్లాలంటే వాహనదారులు సాహసం చేయాల్సిందే. ఇక చిన్నపాటి వర్షం కురిస్తే బురదలో కూరుకుపోయి వాహనాలు ముందుకు కదలవు. ఈ గ్రామానికి మూడు దారులున్నాయి. ఏ రోడ్డు మార్గం గుండా వచ్చినా గుంతలు పడ్డ బాటే దిక్కు. అర్ధరాత్రి ఎవరైన అనారోగ్యానికి గురైతే వారి పరిస్థితి వర్ణనాతీతం. అదో ప్రత్యక్ష నరకమే. ఇలా ఎన్నో ఏళ్లుగా ఆ గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిపడుతున్నారు. తమ ఊరికి రోడ్డు ఎప్పుడు వేస్తారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ ఊరికి రోడ్డు వేయించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగుంటపల్లి గ్రామంలో 105 కుటుంబాలు ఉన్నాయి. 500 పైగా జనాభా ఉంది. గ్రామస్తులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.

మట్టి రోడ్లు ఉన్న గ్రామాలు

మండలంలోని పలు గ్రామాల అంతర్గత రోడ్లు వర్షం కురిస్తే బురదమయమవుతాయి. దీంతో కనీసం నడవడానికి కూడా వీలు పడదు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కూరెల్ల గ్రామం నుంచి శనిగరం రోడ్డు, కోహెడ మండల కేంద్రం నుంచి ఆరేపల్లి మీదుగా బస్వాపూర్, చెంచెల్ చెర్వుపల్లి నుంచి వెంకటేశ్వరపల్లి, ఎర్రగుంటపల్లి నుంచి ఇందుర్తి రోడ్డుకు అలాగే వింజపల్లి-రాంచంద్రాపూర్, అలాగే బస్వాపూర్ నుంచి ముత్తన్నపేట గ్రామాలకు వెళ్లేందుకు అంతర్గత మట్టి రోడ్లే దిక్కు. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఈ రోడ్ల గుండానే రాకపోకలు సాగిస్తారు. మట్టి రోడ్లను బీటీగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి మరో ఇద్దరు కౌన్సిలర్లు


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట మున్సిపల్‌కు చెందిన మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హన్మంతారావు పార్టీలో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆలకుంట కవిత, పయ్యావుల పూర్ణిమకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. మరో 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో సిద్దిపేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పాల్గొన్నారని తెలిపారు.

‘మహిళా శక్తి’ని సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: జాతీయ, రాష్ట్ర స్థాయిలో సిద్దిపేట మహిళా సంఘాలకు మంచి గుర్తింపు ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణిలతో కలిసి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ఆర్థిక సర్వే బుక్‌లో సిద్దిపేట స్టీల్ బ్యాంకు ప్రస్తావన రావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు దిశానిర్దేశం, డ్వాక్రా సంఘాల చిత్తశుద్ధితోనే జాతీయ స్థాయిలో స్టీల్ బ్యాంక్ గుర్తింపు పొందిందన్నారు. మహిళలకు, వీధి వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వ రుణాల మంజూరులో సిద్దిపేట అర్బన్ మెప్మా జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఉందని తెలిపారు. మహిళా శక్తి పథకంతో డ్వాక్రా సంఘాలు ఆర్థికంగా బలోపేత మయ్యేందుకు దోహద పడదామన్నారు. మరిన్ని డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు ఆర్పీలు చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన ప్రతీపనిలో ఆర్పీ, డ్వాక్రా సంఘాల పాత్ర ఉందన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని, వాటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మహిళా సంఘాల ప్రతినిధులు వార్డుల్లో తిరిగి ప్రజలను చైతన్య పరచాలన్నారు. సమావేశంలో మెప్మా అధికారులు హనుమంతారెడ్డి, సాయి, రమ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి దేశానికి ఆదర్శం

దుబ్బాక: మహిళాశక్తి దేశానికి ఆదర్శమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మహిళా అభివృద్ధి, హక్కులు, చట్టాలు, మహిళా సాధికారితపై మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. వ్యాపారాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

అంబేడ్కర్ విగ్రహానికి వినతి


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, యువజన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం చిన్నకోడూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల మండల అధ్యక్షులు గుజ్జ రాజు, గుండవెల్లి వేణు మాట్లాడారు. ఈనెల 23వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు రూపాయి కేటాయించకపోవడం కేంద్ర వివక్షకు నిదర్శనమన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడం దారుణమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చి హామీలను కూడా కేంద్రం పట్టించుకోలేదన్నారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగు ట్రైబల్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమతోపాటు తెలంగాణ రాష్ట్రానికి అధిక నిధులు రాబట్టడంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని ఆరోపించారు.

వారసంత ప్రారంభం


సంతను ప్రారంభిస్తున్న కార్యదర్శి నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండల కేంద్రంలో గురువారం వార సంతను మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్రతో కలిసి పంచాయతీ కార్యదర్శి నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో వారసంత ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని, ప్రతీ గురువారం గాంధీ విగ్రహం వద్ద సంత జరుగుతుందన్నారు. సమీప గ్రామాల రైతులు పండించే కూరగాయలను నేరుగా సంతలో విక్రయించాలన్నారు. వార సంతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోండి

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: ఇంటి ఆవరణలో స్థలం ఉన్న ప్రతీ ఇంటి యజమాని ఇంకుడు గుంత నిర్మించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో గురువారం సఫాయి అప్నే బీమారి భగావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకుడు గుంతల నిర్మాణంతో వర్షపు నీరు నేరుగా భూమికిలోకి చేరి ఇంకిపోతుందని, దీంతో భూగర్భ జలమట్టం పెరుగుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

జయప్రదం చేయండి

సిద్దిపేటఅర్బన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30వ తేదీన తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాల స్వామి పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఏడు నెలలు కావస్తున్నా గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశం మేరకు వీధి కుక్కల నియంత్రణకు, పెంపుడు కుక్కల సంరక్షణ యజమానులే చూసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

హరిత దుబ్బాకే లక్ష్యం


దుబ్బాకలో మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్: హరిత దుబ్బాకే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేశ్ కుమార్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా దుబ్బాక పట్టణంలో గురువారం వంద పడకల ఆసుపత్రి, తహసీల్దార్ కార్యాలయ మార్గం, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా ఈ సంవత్సరం 33 వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి


ఓటు వేసేందుకు క్యూలో నిలుచున్న విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్): రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని హెచ్ఎం జ్యోతి విద్యార్థులకు సూచించారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల అంతర్గత పోటీల్లో భాగంగా నిర్వహించిన హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఓటు ద్వారా వారిని ఎన్నుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు పవిత్రతను తెలియజేస్తూ ఎటువంటి రాగద్వేషాలు, భయాందోళనలకు గురికాకుండా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. బాలుర విభాగం నుంచి ఇద్దరు బైరి ప్రవీణ్, బైరగోని ధనుష్ పోటీచేయగా బైరి ప్రవీణ్‌కి 72 ఓట్లు రాగా బైరగోని ధనుష్‌కు 70, నోటాకు రెండు ఓట్లు వచ్చాయి. బాలికల విభాగం నుంచి నలుగురు జంగపల్లి హర్షిత, బైరి భాను శ్రీ, సుంకరి రత్నదీపిక, మద్దెల అర్చన పోటీ చేయగా బైరి భాను శ్రీకి 35 అత్యధిక ఓట్లు సాధించింది. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా రామస్‌బాబు, ఎన్నికల సిబ్బందిగా ఉపాధ్యాయులు జంగపల్లి వెంకటనర్సయ్య, నోముల చంద్రారెడ్డి, అడేవు శ్రీనివాస్, శంకర్‌నాయక్, కృష్ణకుమారి, మంజు వ్యవహరించారు.

స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈనెల 27వ తేదీన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం తెలిపారు. అర్హులైన వారు నిర్ణీత తేదీలో సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. కళాశాలలో అన్ని వసతులున్నాయన్నారు.


నిరుద్యోగులకు న్యాయం చేయాలి

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్ బాబు


మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్ బాబు

హుస్నాబాద్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నోటిఫికేషన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు మండలాల నిరుద్యోగులకు న్యాయం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేట జిల్లాలో చేర్చారన్నారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న 327 పోస్టులకు మార్చి 1వ తేదీన నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. ఈ నోటిఫికేషన్‌లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు మండలాల నిరుద్యోగులు స్థానికత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న జిల్లాలకు మాత్రమే 95 శాతం స్థానికతను వర్తింపచేసి ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. విడుదల చేసిన రెండో నోటిఫికేషన్‌లోనైనా నాలుగు మండలాల నిరుద్యోగులకు స్థానికత వర్తింపచేసేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాంప్రసాద్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి


ఇబ్రహీంనగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

చిన్నకోడూరు(సిద్దిపేట): వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రజలు శ్రద్ధ చూపకపోవడం, క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంవల్లనో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. అపరిశుభ్ర పరిసరాల కారణంగా దోమలు, ఈగల బెడదలో ప్రజలు అల్లాడుతున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో పారిశుద్ధ్య పనులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

హుస్నాబాద్‌రూరల్: అపరిచితులతో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ పి.మహేశ్ అన్నారు. గురువారం మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేరాలు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణకు కొత్త చట్టాలు వచ్చాయన్నారు. మానవ అపహరణ, ర్యాగింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లేశం, హెచ్ఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

◆ బాధ్యతల స్వీకరణ

మద్దూరు(హుస్నాబాద్): పంచాయతీ రాజ్ ఏఈగా గౌస్ మొహిద్దీన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొమరంభీమ్ జిల్లా ఆసిఫాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన వినయ్ రెడ్డి బదిలీపై వెళ్లారు. అలాగే ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో కొమురవెల్లి మండలం ఎంపీఓ వీరరాజు మద్దూరు ఎంపీఓగా బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ రామ్మోహన్ తెలిపారు.

◆ తహసీల్దార్‌గా..

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల తహసీల్దార్‌గా పి.చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భద్రాద్రి కొత్తగూడెం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేసిన అహ్మద్ ఖాన్ సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు.

◆ సమస్యల పరిష్కారానికి వినతి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిని సీపీఐ నాయకులు కోరారు. గురువారం కరీంనగర్‌లో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన సీపీఐ నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, రాంపూర్ తదితర గ్రామాలు మల్లన్నసాగర్‌లో ముంపునకు గురయ్యాయని, గత ప్రభుత్వం పరిహారం, ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. చాలా మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రావాల్సి ఉందని తెలిపారు. ఉపాధి హామీ పనులను కల్పించడంతో పాటు యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చూడాలని కోరారు. మల్లన్నసాగర్ నిర్మాణం తర్వాత మిగులు భూములను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

◆ రైతుబీమాపై అవగాహన కల్పించాలి

గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్

కొండపాక(గజ్వేల్): రైతులకు రైతుబీమాపై అధికారులు అవగాహన కల్పించాలని గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబూనాయక్ అన్నారు. కుకునూరుపల్లిలో కొనసాగుతున్న రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతుబీమా చేయించుకున్నవారు సవరణలు చేయించుకునేందుకు ఈనెల 30 తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వచ్చేనెల 5వ తేదీ వరకు కొత్తగా బీమా చేయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. రైతుబీమాకు 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు అర్హులన్నారు.

◆ పెండింగ్ డీఏలు మంజూరు చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావల్సిన పెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ విజ్ఞప్తి చేశారు. బెజ్జంకి ప్రభుత్వ పాఠశాలలో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రెండు డీఏలతో పాటు బకాయి డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు.

◆ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ములుగు(గజ్వేల్): బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ ములుగు మండల ఇన్‌చార్జి వెంకటరమణ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వంటిమామిడిలో పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, త్వరలో గ్రామాల్లో నిర్వహించనున్న జెండా కార్యక్రమాలను కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.